క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతం పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకు వచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

దుర్వాసనతో ఇక్కట్లు



నిలిచిపోయిన మురుగు నీరు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రైనేజీలో మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్వాసనతో పాటు ఈగలు, దోమలతో సహవాసం చేయాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా డ్రైనేజీలో వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి రోడ్డుపైకి కూడా ప్రవహిస్తుందని.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమునిపట్నం: భీమిలి పరిధిలో నేడు విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ సకరయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోమన్నపాలెం, రెడ్డీలపాలె, గొల్లలపాలెం, కె.నగరపాలెం, దిబ్బడిపాలెం, మంగమారిపేట, రామాది, రాయపాలెం, రేఖవానిపాలెం, మహాలక్ష్మిపురం, బ్యాంక్ కాలనీ, రాజులింగంపేట, డెక్కతిపాలెం, చిన్నబజారు, తోటవీధి, రెల్లివీధి, బర్మాకాలనీ, అప్పికొండ వీధి, కొంకువీధి, కృష్ణాకాలనీ, మూలకుద్దు, మరడపాలెం, కీతిన్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కేకేవీ బులికృష్ణ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట సామాజిక భవనం వద్ద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి బులికృష్ణ పాల్గొని న్యాయ అవగాహన ద్వారా మహిళా సాధికారత సాధ్యమని తెలిపారు. మహిళా భద్రతకు పోలీసులు అందిస్తున్న పలు సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మణమూర్తి, న్యాయవాదులు శ్రీలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

క్యాబేజీకి గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో క్యాబేజీ బుట్టలు

సీతమ్మధార: క్యాబేజీకి గిరాకీ పెరగడంతో సీతమ్మధార రైతుబజార్‌కు రైతులు భారీగా సరకు తీసుకొచ్చారు. కిలో క్యాబేజీ బుట్ట రూ.10 ధర పలుకుతోంది. దీంతో వినియోగదారులు అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.

ఆరోగ్యానికి సెగ

- జనావాసాల నడుమ ఇటుక బట్టీలతో ఇక్కట్లు
- మట్టి, బురద, పొగ చూరిపోతున్న రహదారులు, ఇళ్లు, పొలాలు



ఇటుక బట్టీల కారణంగా దిగుబడి తగ్గిపోతున్న మొక్కజొన్న పంట



తాటితూరు రహదారిపై మట్టి, బురద వ్యర్థాలు



రహదారి పక్కన బొగ్గు నిల్వలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయితీ రహదారిలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి రహదారికి ఇరువైపులా ఉన్న ఇటుక బట్టీల కారణంగా పలు ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. అసలే ఇరుగ్గా ఉండే ఎనిమిది అడుగుల రహదారిపై బట్టీలకు వినియోగించే మట్టి, వ్యర్థాలు కలిసిపోయి బురదగా మారిపోతోంది. దాంతో పాటు బట్టీలు కాల్చేటప్పుడు వచ్చే పొగతో స్థానికులు పొగ, దుమ్ము వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మట్టి, బొగ్గు రేణువులు గాలికి చెలరేగి దగ్గరలోని పంట భూములపై పడి దిగుబడికి నష్టం కలిగిస్తున్నాయి. పాక్షికంగా బట్టీల వద్ద గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసినా కాలుష్యాన్ని అరికట్టలేకపోతున్నాయని తాటితూరువాసులు ఆందోళన చెందుతున్నారు. మట్టి, నీరు కలిసి రోడ్లపై చెరువుగా మారడంతో ద్విచక్ర వాహనదారులు బోల్తా పడుతున్నారు. రహదారిపై బురద కారణంగా నిత్యం ఆటోవాలాలు ఇక్కడి బట్టీల యజమానులతో గొడవకు దిగుతున్నారు. నివాసాలు, రహదారులకు దూరంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలని గతంలో భీమిలి రెవెన్యూ అధికారులు ఆదేశించినా అది కార్యరూపం దాల్చలేదు.

చర్యలు చేపట్టాలి: ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు తలెల్తుతున్నాయని పంచాయితీవాసులు ఇప్పటికే పలుమార్లు పంచాయితీ పాలకవర్గం, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. మొక్కజొన్న, నువ్వు తదితర పంటలపై బట్టీల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. అలాగే బావుల్లో నీరు కూడా నల్లబారిపోతుందని చెప్పినా ఇప్పటికీ చర్యలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇటుక బట్టీల నుంచి జరుగుతున్న హాని నుంచి ప్రయాణికులు, సమీప గృహాలు, పంటలు, తాగునీటి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పన్ను కోసం 4 నెలలుగా తిప్పుతున్నారంటూ ఫిర్యాదు

- తక్షణ చర్యలు చేపడతామన్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న ఇంటికి ఇంటి పన్ను, వీఎల్‌టీ వెయ్యమని అడిగితే సంబధిత ఉద్యోగి 4 నెలలుగా తిప్పుతున్నాడని బక్కన్నపాలేనికి చెందిన పిల్లి చంద్రశేఖర్ అనే వ్యక్తి వాపోయాడు. ఈ మేరకు శుక్రవారం జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మిని కలిసి తన గోడు వెళ్లబుచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఇంటికి, ఖాళీ స్థలానికి పన్ను వెయ్యమని అడిగితే డబ్బులు డిమాండ్ చేశారన్నారు. డబ్బులు ఇవ్వనందునే తనను 4 నెలలుగా కాళ్లరిగేలా తిప్పుతున్నారని విమర్శించారు. పన్ను వెయ్యకపోవడమే కాకుండా అప్లికేషన్ కూడా తిరస్కరించారని అన్నారు. తనలాంటి బాధితులు ఇక్కడ చాలా మంది ఉన్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై జెడ్సీ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ సదరు వ్యక్తికి నిబంధనల ప్రకారం సర్వే రిపోర్టు ఆధారంగా పన్ను వేయాలని ఆదేశించామన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న శీరపు అప్పలరెడ్డి



సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న రేఖవానిపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయితీ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ముందుగా బాగుపడేది భీమిలి ప్రజలేనని సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మల్లేటి హరిశంకర్, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, వార్డు సభ్యులు పి.కొండమ్మ, మల్లేటి మహేష్‌వర్మ, కన్వీనర్ పి.పద్మ, గృహసారథులు పాల్గొన్నారు.

2వ వార్డులో..

కొమ్మాది: జీవీఎంసీ 2వ వార్డు చిల్డ్రన్‌పార్క్ ప్రైమరీ స్కూల్ యాజమాన్యాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, శ్రీ సత్యనారాయణ స్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ సరగడ నాగిరెడ్డి, బీసీ సెల్ సెక్రటరీ టి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



ఎంపీడీవో రాధకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పద్మనాభం: చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరావు అన్నారు. రేవిడి పీహెచ్‌సీలో శుక్రవారం ఈ నెల 14వ తేదీన జరగనున్న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పంపిణీ చేయాల్సిన మాత్రల గురించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి వారికి బర్త్ ప్లానింగ్ గురించి తెలియజేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వే చేయించాలని వైద్యాధికారి, సూపర్‌వైజర్లలకు సూచించారు. మందుల విభాగాన్ని, రిజస్టర్లను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ గురించి ఆరా తీసి ఎంపీడీవో రాధకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ఎస్.రమారెడ్డి పాల్గొన్నారు.


యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ మృతదేహం

కూర్మన్నపాలెం : అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్ డిగ్రీ చదువుతున్నాడు. మృతుడి తండ్రి కనక అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ప్రసాద్‌కు కాలేయానికి సంబంధించిన శస్త్ర జరిగింది. ఈ ఏడాది జనవరిలో అప్పారావుకు హార్ట్ ఆపరేషన్ అయింది. తండ్రి కూడా అనారోగ్యానికి గురవ్వడంతో ప్రసాద్ సరిగ్గా తిండి తినక, మందులు వాడకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ప్రసాద్ తరచూ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వడ్లపూడిలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఇది ఇలా ఉండగా గురువారం రాత్రి తండ్రి అప్పారావు నరవలోని ఓ పెళ్లికి హాజరవ్వగా, మృతుడి తల్లి, చెల్లి ఎస్.కోటలోని మరో పెళ్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రసాద్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు బంగారు గొలుసు వితరణ



బంగారు గొలుసును ఏఈవోకు అందజేస్తున్న దాత గౌరీశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన మళ్ల గౌరీ శంకర్ అనే దాత సుమారు 42.730 గ్రాముల బంగారం గొలుసు కానుకగా ఇచ్చారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన దాత గొలుసును ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.

గీతంలో
రహదారి భద్రతపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొమ్మాది: రహదారి ప్రమాదాలు నివారించడానికి, యువతలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించడానికి జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గీతంలో రహదారి భద్రతా ర్యాలీ నిర్వహించారు. గీతం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని గీతం సెక్యూరిటీ డైరెక్టర్ బీవీ రమణకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలు నడిపేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

నృత్య కళాకారిణికి పురస్కారం



నాట్యరత్న పురస్కారం అందుకుంటున్న అరుణ

కొమ్మాది: సాగర్‌నగర్‌కు చెందిన నృత్య కళాకారిణి అనిపిండి అరుణ నాట్యరత్న పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన మహిళల విశిష్ట పురస్కారాల్లో భాగంగా ఆమెకు ఒడిస్సీ లెజెండ్రీ డ్యాన్సర్ షరాన్‌లోవర్ నాట్యరత్న పురస్కారాన్ని అందజేశారు. తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆమెకు ఈ పురస్కారం లభించింది.


తీరంలో
చిల్లర దొంగలతో బెంబేలు



ఫ్రిడ్జి డోర్ తొలగించి ఉన్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారి తీరం నుండి చేపలుప్పాడ తీరం వరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న పాన్ షాప్‌లలో తరచూ ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. గురువారం అర్ధరాత్రి మంగమారిపేట హైస్కూల్ సమీపంలో ఉన్న ఇష్క పాన్ షాప్ వద్ద చిల్లర దొంగలు చొరబడి ఫ్రిడ్జి డోర్ తొలగించి డ్రింక్‌లు తీసుకుపోయారని పాన్‌షాప్ యజమాని గరికిన గంగ తెలిపారు. రెండవసారి ఇలా జరిగిందన్నారు. బీచ్ పెట్రోల్ పోలీసుల రాత్రి గస్తీ సరిగ్గా లేక చిల్లర దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని.. పోలీసులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇక్కడి వారు కోరుతున్నారు.

డీఈవో సందర్శన



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూ క్యాంపస్: ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల టాబ్స్ వినియోగం, జగనన్న విద్య కానుక కిట్స్ నిర్వహణ, నోట్‌బుక్స్ కరక్షన్, పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డీఈవో స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఏపీవో అప్పలనాయుడు, ఏఎల్ఎస్‌సీవో శైలజ పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు జీవీ ప్రత్యేక పూజలు



జీవీకి స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

మధురవాడ: జాతర గట్టుపై వెలసిన చంద్రంపాలెం దుర్గాలమ్మ అమ్మ వారికి స్మార్టు సిటీ మాజీ చైర్మన్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు కమిటీ సభ్యులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి పూజల అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఫల్గుణ మాసం బహుళ తదియను పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, కుంకుమార్చన, పుష్పార్చన పూజలు, సాయంత్రం పంచామృత జలాభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి పూజలు చేశారు. శివశక్తినగర్‌కు చెందిన దుర్గ భానుకిరణ్, అంజలి, కె. శ్రీనివాసరావు, పవన కుమారిల సహకారంతో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, పిల్లా శ్రీనివాసరావు, దుక్కవరం, పిల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మూడెకరాల తోట దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆనందపురం : మండలంలోని కణమాం కొండల్లో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు మూడెకరాల మేర తోటలు దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. పశువుల కాపరులు సిగరెట్ వెలిగించి పారవేయడంతో ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. అకేషియా, నీలగిరి తోటలకు మంటలు అంటుకుని వ్యాపించడాన్ని గమనించిన కొంత మంది తాళ్లవలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేదంటే ఎక్కువ విస్తీర్ణంలో తోటలు ధ్వంసమయ్యేవని స్థానిక రైతులు తెలిపారు.

మాత్రల పంపిణీకి ఏర్పాట్లు



ఉపాధ్యాయులకు మాత్రలు అందజేస్తున్న వైద్యాధికారిణి శైలజ

ఆనందపురం : మండలంలో నులిపురుగుల మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కలిగించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో 18 వందల మంది పిల్లలు ఉన్నారన్నారు. వారందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14 మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలు అందించవలసి ఉంటుందన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు గల వారికి సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల గల వారికి పూర్తి మాత్ర నమిలి మింగించాలని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఉపాధ్యాయులకు మాత్రల ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు షెహనాజ్, హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, ఫార్మసిస్ట్ జయకుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రైనేజీలు



బాలాజీనగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్ శివారులో ప్రాథమిక పాఠశాలకు సమీపంలో డ్రైనేజీలు అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నివాసాల నుంచి వాడుక నీరు శివారులోని గెడ్డలో కలవాల్సి ఉండగా పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వరకే డ్రైనేజీ ఉండటంతో అక్కడున్న వ్యవసాయ భూముల్లో మురుగునీరు కలసిపోతోంది. దీంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవాలని ముందుకు వచ్చిన వారు మురుగు నీటిని చూసి వెనక్కి వెళ్లిపోతున్నారు. బాలాజీనగర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గెడ్డ వరకు డ్రైనేజీని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పవర్ ఎలక్ట్రానిక్స్‌పై గీతంలో వర్క్‌షాప్

కొమ్మాది: విద్యుత్ వాహనాల్లో పవర్ ఎలక్ట్రానిక్స్, సంప్రదాయేతర ఇంధన వనరుల పాత్రపై గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌ను శుక్రవారం ఐఐటీ గాంధీనగర్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాఘవన్ ప్రారంభించారు. విద్యుత్ వాహన రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు.

వర్క్ ఫ్రం హోమ్‌తో బహుళ ప్రయోజనాలు



నివేదిక విడుదల చేస్తున్న సిడార్ సంస్థ ప్రతినిధులు

సీతంపేట : కోవిడ్ మహమ్మారి కారణంగా వెలుగులోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం అటు వ్యాపార సంస్థలు, ఇటు ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్) చైర్మన్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి పని, ఉద్యోగుల దృక్పథాలు అనే అంశంపై సంస్థ చేపట్టిన సర్వే నివేదికను శుక్రవారం బుల్లయ్య కళాశాలలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు వర్క్ ఫ్రం హోమ్ విధానం లేకపోయినప్పటికీ వ్యాపార, సాఫ్ట్‌వేర్ సంస్థలు వాటి మనుడగ కోసం ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడం తప్పనిసరైందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వారి జీవన విధానంలో మంచి సౌలభ్యం లభించిందన్నారు. ఈ సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిశాయని, వాటన్నింటిని క్రోడీకరించి నివేదిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో సిడార్ ప్రతినిధులు డాక్టర్ జి.మధుకుమార్, పలువురు ప్రొఫెసర్లు బాల మోహన్‌దాస్, రామకృష్ణారావు, హరినారాయణ, పి.విజయప్రకాష్, హెచ్.ఎల్.ఎస్.దొర, ఎల్.డి.సుధాకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్నకు సమర్పిస్తామన్నారు.